ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
3
సోమవారం 24 జూన్ 2024

సామాన్యులకే రూల్స్.. మాకెందుకు రూల్స్.. అంటూ వైసీపీ నేతలు బరితెగించారు. 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఐదేళ్ల పాలన అంతా నిబంధనలకు విరుద్ధంగానే సాగింది. అనుమతుల్లేకుండానే అడ్డగోలుగా ఎక్కడపడితే అక్కడ నిర్మాణాలు, ఎకరాలకు ఎకరాలు కబ్జాలు, దౌర్జన్యాలతోనే సరిపోయింది. ఈ క్రమంలోనే కడప నగరంలో రూ.15 కోట్ల ప్రభుత్వ భూమిని రూ.వెయ్యితో 33 ఏళ్లకు లీజుకు తీసుకుని వైసీపీ కార్యాలయాన్ని నిర్మించారు. రాజప్రాసాదాన్ని తలపించేలా కార్యాలయాన్ని కూడా నిర్మించారు. అయితే ఇది చూసిన సామాన్యులు 'హవ్వ.. పేదలు ఒక సెంటు స్థలంలో గుడిసెలు వేసుకొంటే పీకిపడేస్తారు.. మరి వీరు ఎకరాలకు ఎకరాలు అక్రమంగా స్వాధీనం చేసుకొని రాజభవనాలు నిర్మిస్తుంటే అధికారులకు కనపడలేదా' వారికి ఒక రూలు.. మాకు ఒక రూలా.. అంటూ మండిపడుతున్నారు.



"రూల్స్ అనేవి ముఖ్యమంత్రికైనా, సామాన్యుడికైనా ఒకేలా ఉండాలి. ఒక సామాన్యుడు అక్రమంగా రేకుల షెడ్డు వేసుకుంటే అధికారులు ఊరుకుంటారా.. వెంటనే తొలగిస్తారు. ఎందుకంటే అతడు సామాన్యుడు కాబట్టి. సామాన్యుడికి ఒక న్యాయం, ముఖ్యమంత్రికి ఒక న్యాయమా నది పక్కనే నేరుగా ఇలా ఇళ్లు కట్టుకొని నది ప్రవాహాన్ని అడ్డుకొంటే ఎలా ? రాజకీయ చరిత్ర ఉన్న వారందరికీ ఆదర్శంగా ఉండాలి. ఇది చూసి ఇలాంటి వారు మా నాయకుడు అని జనం చెప్పే పరిస్థితిలో ఉండాలి. అధికారంలో ఉన్నవారే నిబంధనలు పాటించకుంటే ఎలా ? అందుకే మొట్ట మొదటిసారిగా అక్రమంగా కట్టిన ప్రజావేదికను కూల్చేయాలని ఉత్తర్వులు ఇచ్చా. ఎక్కడైతే కలెక్టర్ల సమావేశం జరిగిందో... వ్యవస్థ అంతా పోయి ఎక్కడ కూర్చుందో ఆ అక్రమ భవనాన్ని కూల్చేయాలని ఆదేశాలు ఇచ్చా" ఇది.. ప్రజావేదిక కూల్చిన తర్వాత సీఎం హోదాలో అసెంబ్లీలో జగన్ మాట్లాడిన మాటలు.



- అనుమతుల్లేకుండానే అడ్డగోలుగా పార్టీ కార్యాలయ నిర్మాణం
- రూ.15 కోట్ల ప్రభుత్వ భూమిని రూ.వెయ్యితో 33 ఏళ్లకు లీజుకు
- రాజప్రాసాదాన్ని తలపించేలా కార్యాలయ నిర్మాణం

వైసీపీకి నో రూల్స్

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ అక్రమ కట్టడాలపై సీరియస్‌గా ఉండడంతో, ఇక అక్రమ కట్టడాలన్నీ రాష్ట్రంలో కూల్చేస్తారని, ప్లాన్ లేకుండా నిర్మాణం జరిగితే సహించనని అందరూ అనుకున్నారు. ముఖ్యంగా కడప, ప్రొద్దుటూరుల్లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వారి గుండెల్లో అప్పటి జగన్ మాటలు గుబులు రేకెత్తించాయి. సీన్ కట్ చేస్తే జగన్ మాటలు రాజకీయ కక్షే అని తేలిపోయింది. చెప్పేందుకే నీతులు అన్నట్లుగా అనుమతులు లేని కట్టడాలపై కూనిరాగం తీసినట్లుగా ఆయన పాలనలోనే అక్రమ కట్టడాలకు తెరలేపారు. జగన్ కడపలో నిర్మిస్తున్న రాజప్రసాదం లాంటి ప్యాలెస్‌ను అనుమతులు లేకుండా నిర్మించడం చూసి ఔరా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజావేదికను కూల్చే సమయంలో జగన్ పెద్దపెద్ద డైలాగులు చెప్పారు. మరి పార్టీ ఆఫీసు మాత్రం ప్లాన్ లేకుండానే కడుతున్నారు. ఇక సామాన్యుడికి ఒక రూలు, వైసీపీకి ఒక రూలు అన్నట్లుగా జగన్ పాలనలో సాగినట్లు అర్థమవుతోంది.

రూ.15కోట్ల స్థలం ధారాదత్తం

కడపలోని చెన్నై రోడ్డులో చిన్నచౌక్ రెవెన్యూ పొలం సర్వే నెంబరు 424/7లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ కార్యాలయం కోసం తీసుకుంది. రూ.వెయ్యి లీజుతో 33 సంవత్సరాలు లీజుకు తీసుకుంది. చెన్నై బైపాస్‌లో ఆ ప్రాంతంలోని భూములకు మంచి డిమాండ్ ఉంది. కడప సిటీ రాజంపేట రోడ్డుకు బాగా విస్తరిస్తోంది. ఇక్కడ సకల సౌకర్యాలు, కళ్యాణమండపాలు ఉన్నాయి. ఈ స్థలం కూడా చెన్నై రహదారికి అతి సమీపంలో ఉంది. రోడ్డు పక్కన సెంటు రూ.20 నుంచి రూ.30 లక్షల దాకా ఉంది. వైసీపీ కార్యాలయం పక్కనే వైసీపీ నేత ఒకరు వెంచర్ వేసి సెంటు రూ.12 లక్షలకు అమ్ముకున్నట్లు చెబుతారు. అంటే ఎకరా రూ.7కోట్లు పైమాటే. దాన్ని బట్టి సుమారు రూ.15 కోట్లు విలువైన స్థలాన్ని వైసీపీ కోసం కొట్టేశారు. ఇక అప్పుడు జగనే అధికారంలో ఉండడంతో చకచకా భూకేటాయింపులు జరిగాయి. గతేడాది జనవరి 31న రెండు ఎకరాల భూమిని వైసీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబుకు హ్యాండోవర్ చేస్తూ అప్పటి కడప తహసీల్దార్ ఆదేశాలు ఇచ్చారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు

కార్పొరేషన్ పరిధిలో ఏదైనా నిర్మాణం సాగించాలంటే టౌన్‌ప్లానింగ్ అనుమతి తప్పనిసరి. సీఎం హోదాలో జగన్ చెప్పినట్లు సామాన్యులు అనుమతులు లేకుండా రేకుల షెడ్డు వేసినా అధికారులు కూల్చేశారు. కమిషనర్‌గా సాయిప్రవీణ్‌చంద్ బాధ్యతలు చేపట్టి అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపారు. సచివాలయ సిబ్బంది అనుమతులు లేని కట్టడాలపై నోటీసులు ఇస్తూ వచ్చారు. అయితే జగన్ చెప్పినట్లుగా సాయిప్రవీణ్‌చంద్ అండ్ కో సామాన్యుల విషయంలోనే నిబంధనల ప్రకారం వెళ్లినట్లు అర్థమవుతోంది. పెద్దవారి జోలికి వెళ్లరని, ముఖ్యంగా వైసీపీ నేతలకు సపరేట్ రూల్స్ ఫాలో అవుతున్నట్లు అర్థమవుతోంది. రెండు ఎకరాల్లో రాజప్రసాదాన్ని తలపించేలా అనుమతులు లేకుండా వైసీపీ కార్యాలయాన్ని కడుతున్నా అధికార యంత్రాంగం ఆపే సాహసం చేయలేదు. వీఎల్‌టీ కేవలం ఖాళీ స్థలానికి పన్ను వేసుకొని నిర్మాణాన్ని తలపెట్టారు. దాదాపు పూర్తి కావచ్చింది. అప్పట్లో రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉంది. కడప కార్పొరేషన్ పాలక వర్గం వైసీపీ చేతిలోనే ఉంది. వారికి ప్లాన్ కావాలంటే నిమిషాల్లోనే వచ్చేవి. అయితే తమ రాజ్యంలో తమకు రూల్సేంది. సామాన్యులకే రూల్స్. వైసీపీకి నో రూల్స్ అనుకున్నారేమో.. అనుమతులు లేకుండానే బిల్డింగ్ కట్టారు. పేదలకు ఎక్కడో కొండల్లో, గుట్టల్లో సెంటు స్థలం ఇచ్చి ఇళ్లు కట్టుకోమని చెప్పి భారీ ప్రచారాన్ని జగన్ అండ్ కో చెప్పింది. అయితే కోట్ల విలువైన స్థలాన్ని రూ.వెయ్యితో లీజుకు తీసుకుంది. అదే స్థలంలో పేదలకు ఇచ్చి ఉంటే అద్భుతమైన కాలనీ ఏర్పడేది. రాబోయే రోజుల్లో వారు లక్షాధికారులు అయ్యేవారు. జగన్ రూటే సపరేటు కదా.. పేదలు పేదలుగానే ఉండాలి. తాము మాత్రం పైకి ఎదగాలి అనే విధంగా ఆయన పాలన సాగిందనే విమర్శలు ఉన్నాయి. కాగా కమిషనర్ సాయిప్రవీణ్‌చంద్ స్ట్రిక్ట్ ఆఫీసరనే ముద్ర జనాల్లో ఉన్నా.. సార్ ఎందుకనో సాహసం చేయలేకపోయారనే చర్చ నడుస్తోంది. వైసీపీ కావడంతో సార్ కూడా భయపడి ఉంటారేమో అని సెటైర్స్ వేస్తున్నారు.



నేటి నుంచి ప్రజా ఫిర్యాదుల స్వీకరణ : కలెక్టర్

కడప(కలెక్టరేట్), జూన్ 23: ఇక నుంచి ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించే కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24న సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆయాశాఖల అధికారులందరూ తమ పరిధిలోని అర్జీలను మీ కోసం వెబ్‌సైట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

హార్సిలీహిల్స్‌లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

బి.కొత్తకోట, జూన్ 23: ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి, హర్యానా రాష్ట్ర రెగ్యులేటరీ కమిటీ అండ్ అప్పిలేట్ అథారిటీ జస్టిస్ సురేందర్‌గుప్తా ఆదివారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరికి ప్రోటోకాల్ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పోలీస్, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్, సీఐ సూర్యనారాయణ, బి.కొత్తకోట తహసీల్దార్ పుణ్యవతి తదితరులు మాజీ న్యాయమూర్తి కుటుంబానికి సాదర స్వాగతం పలికారు. హార్సిలీహిల్స్‌లో ఉన్న పోలీస్ అతిథిగృహంలో వారికి బస ఏర్పాటు చేశారు. వీరు ఈనెల 25వరకు హార్సిలీహిల్స్‌లోనే ఉంటారని అధికారులు తెలిపారు.

వసతి గృహం కూల్చివేత

- రోడ్డున పడ్డ నిరాశ్రయులు



మైదుకూరు, జూన్ 23: ఓ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చే ప్రక్రియలో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న నిరాశ్రయుల వసతిగృహాన్ని ఎక్సకవేటర్ల సాయంతో ఆదివారం కూల్చివేసిన సంఘటన వివాదానికి దారితీస్తోంది. వారికి వేరే దారి చూపకుండానే భవనం కూల్చివేయడంతో నిరాశ్రయులు రోడ్డున పడ్డారు.

స్థానిక పెరుగు క్రిష్ణయ్యయాదవ్ తన సొసైటీ నిర్వహణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొని మహాత్మాగాంధీ నిరాశ్రయుల వసతి గృహాన్ని గత 10 ఏళ్లుగా నడుపుతున్నారు. ఇక్కడ బాటసారులు, అనాథలు, ఆలయాల వద్ద తలదాచుకునే వారు నిత్యం పదుల సంఖ్యలో వసతి గృహంలో తలదాచుకుంటూ ఉంటారు. వారికి భోజన వసతి కూడా కల్పిస్తున్నారు. అయితే ఆర్టీసీకి వస్తున్న ఆదాయం తక్కువ కావడంతో వ్యాపార ధోరణిలో వ్యవహరించిన అధికారులు ఆ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ దశలో వసతి గృహాన్ని ఖాళీ చేయాల్సిందిగా నాలుగు రోజుల కిందట నిర్వాహకులకు నోటీసు ఇచ్చారు. కాగా నిర్వాహకులు లేని సమయంలో ఆదివారం ఉదయం రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి, స్థానిక డిపో మేనేజరు శ్రీనివాసరావులు డిపోలోని మెకానికల్ ఉద్యోగులతో నిరాశ్రయంలో ఉన్న వస్తుసామగ్రిని దూరంగా ఉన్న బస్టాండ్‌లోని విచారణ కేంద్రం పక్కన ఉన్న గదిలోకి మోపించారు. దీంతో పది మంది అనాథల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాన్ని అర్ధంతరంగా కూల్చివేయడం తగదని, వారు ఎక్కడ తలదాచుకుంటారని ప్రజా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

ఇంకా సమయం ఉన్నా తొందరపడ్డారు..

నేను గత 10 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం అనుమతులు తీసుకొని వసతిగృహాన్ని నడుపుతున్నాను. ఈ భవనాన్ని ఖాళీ చేయించి ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో నాకు నాలుగు రోజుల కిందట నోటీసు ఇచ్చారు. వారిచ్చిన నోటీసులో వారం రోజులు గడువు ఉంది. ఇంకా సమయం ఉండగానే.. నేను ఊర్లో లేని సమయంలో అధికారులు బలవంతంగా అందులోని వస్తువులు తీసివేసి భవనాన్ని కూల్చివేశారు. ఇది అన్యాయం. దీనిపై నేను కోర్టును ఆశ్రయిస్తాను.

- పెరుగు క్రిష్ణయ్య, నిర్వాహకుడు

నోటీసులు ఇచ్చాం..

బస్టాండ్ ఆవరణలో ఉన్న నిరాశ్రయుల కేంద్రం ఖాళీ చేయమని నిర్వాహకులకు నోటీసులు ఇచ్చాం. ఆ భవన స్థలాన్ని ఇతరులకు ఇచ్చేందుకు టెండర్లు కూడా పిలిచాం. అయినా నిర్వాహకులు ఖాళీ చేయకపోవడంతో అందులో ఉన్న సామగ్రిని జాగ్రత్తగా ఒక గదిలో భద్రపరిచి భవనాలను కూల్చివేశాం.


- శ్రీనివాసరావు, డీఎం, మైదుకూరు

అతిసార వ్యాధిని అరికట్టాలి : తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 23: అతిసార వ్యాధిని అరికట్టాలని మాజీ రాజ్యసభ సభ్యుడు నర్రెడ్డి తులసిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు అన్ని జిల్లాల్లో అతిసార వ్యాధి రోజురోజుకు ఎక్కువవుతోందని, ఆసుపత్రులన్నీ అతిసార వ్యాధిగ్రస్తులతో కిటకిటలాడుతున్నాయన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అతిసార వ్యాధితో నలుగురు చనిపోగా.. 40 మంది చికిత్స పొందుతున్నారని, కాకినాడ జిల్లా సామర్లకోట మండలం జొన్నలదొడ్డిలో ఒకరు మరణించగా... 36 మంది చికిత్స పొందుతున్నారన్నారు. తాగునీటి కాలుష్యమే అతిసారకు కారణమని తెలిపారు. తాగునీటి పైపులు లీకేజీలు కావడం, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం కావడం, పారిశుధ్యాన్ని పట్టించుకోకపోవడమే ప్రధాన కారణాలన్నారు. ప్రభుత్వం సురక్షితమైన తాగునీటి సరఫరాపై శ్రద్ధ వహించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సెలైన్ బాటిళ్ల కొరత లేకుండా జాగ్రత్త వహించాలని తులసిరెడ్డి సూచించారు.

వలంటీర్ల నిర్వాకం

- 20 వేలకు పైగా పేరుకుపోయిన కుల ధ్రువీకరణ పత్రాలు
- కసరత్తు ముమ్మరం చేసిన రెవెన్యూశాఖ



కడప(కలెక్టరేట్), జూన్ 23: గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వలంటీర్ల ద్వారా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్ ఇంటింటా సర్వే ప్రక్రియ తప్పుల తడకగా సాగడంతో రెవెన్యూ యంత్రాంగానికి తిప్పలు తెచ్చింది. కేవలం ఆధార్‌కార్డు ప్రామాణికంగా తీసుకొని సుమోటోగా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి పబ్బం గడుపు కొనేందుకు చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ఇంటింటా సర్వేలో ఆధార్‌కార్డులోని పేర్లే కాకుండా, ఇష్టారాజ్యంగా తల్లిదండ్రుల పేర్లు, పూర్తి స్థాయి చిరునామాలు తప్పొప్పులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 20 వేల సర్టిఫికెట్ల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల ప్రక్రియ ముగిసి ఇప్పుడిప్పుడే రెవెన్యూ సిబ్బంది ఊపిరి పీల్చుకుంటూ ఆఫీసుల్లో ఆశీనులయ్యే సమయంలో కుల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ గుదిబండగా మారింది. రోజు వారి రెవెన్యూ సేవలను చేస్తూనే ఎన్నికలకు ముందు వలంటీర్లు చేసిన తప్పొప్పులను చక్కబెట్టడం సవాలుగా మారింది. ఒక్క కడప తహశీల్దారు కార్యాలయం పరిధిలో సుమారు 14,125 కుల ధ్రువీకరణ పత్రాలు జారీకి గానూ ఇంకా 7,190 సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉన్నాయి. మిగతా మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. కడప తహశీల్దారు కార్యాలయంలో అయితే ఉన్నఫళంగా ఒక్కో గ్రామ రెవెన్యూ అధికారిపై సగటున 4, 5 వందల సర్టిఫికెట్లు పరిశీలించే పరిస్థితి రావడంతో లబోదిబోమంటున్నారు. కడపతో పాటు ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు లాంటి పట్టణ ప్రాంతాల్లో వేల సంఖ్యలో సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉండగా మండల ప్రాంతాల్లో వందల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కలెక్టర్ కుల ధ్రువీకరణ పత్రాల పంపిణీ వేగవంతం చేయాలని రెవెన్యూ డివిజన్ అధికారులను ఆదేశించారు. ఆర్డీవోలు కూడా ఇప్పటికే తహశీల్దార్లు, సిబ్బందితో సమావేశాలు నిర్వహించి వారంలోగా సర్టిఫికెట్ల ప్రక్రియను పూర్తి చేయాలని రోజు వారీగా టార్గెట్ విధించారు. దీంతో తహశీల్దార్లు కూడా తమ సిబ్బంది సకాలంలో కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేయని వీఆర్వోలకు నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లను వ్యక్తులకు సంబంధం లేకుండా ఆధార్‌కార్డు ఆధారంగా చేయడం తమకు తిప్పలు తెచ్చిపెట్టిందని రెవెన్యూ యంత్రాంగం తలలు పట్టుకుంటోంది. తాము చేపట్టిన ఎంక్వైరీలో కొందరి లబ్ధిదారుల అడ్రస్సులు గుర్తించడం, వలంటీర్లు చేసిన తప్పులను చక్కదిద్దడం సవాలే అంటున్నారు.

ఈ విషయంపై కడప తహశీల్దారు వెంకటరమణను వివరణ కోరగా ఎన్నికలకు ముందు చేపట్టిన ఇంటిగ్రేటెడ్ కులధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ సార్వత్రిక ఎన్నికల కారణంగా పూర్తి చేయలేక పోయామన్నారు. వలంటీర్లు చేపట్టిన ఇంటింటా సర్వే అంతా ఆధార్‌కార్డుతో సుమోటోగా చేపట్టడంతో తప్పులు దొర్లాయి. కలెక్టర్, ఆర్డీవోల ఆదేశాల మేరకు వారం లోగా పూర్తి స్థాయిలో పరిశీలన చేసి సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు.

భూసర్వే పేరుతో గందరగోళం

- తరాలుగా సాగు చేసుకుంటున్న భూములు ఆన్‌లైన్ నుంచి తొలగింపు
- అధికార పార్టీ నేతలకు అందలం
- పాత పద్ధతినే కొనసాగించాలంటూ డిమాండ్

బి.కోడూరు, జూన్ 23: రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఐదేళ్లలో భూసర్వే పేరుతో రైతులను గందరగోళాన్ని సృష్టించింది. ఎన్నో తరాల నుంచి సాగు చేస్తున్న భూములు ఆన్‌లైన్ నుంచి తొలగించి రైతులను అయోమయంలోకి నెట్టింది. అప్పుడు రాష్ట్రంలోని ఏఒక్క రైతు నోరు తెరిచి మాట్లాడితే ఏం జరుగుతుందోనని భయపడ్డారు. అందులో భాగంగానే బి.కోడూరు మండలంలో రైతుల భూముల ఆన్‌లైన్‌లో వింత చోటుచేసుకుంది. భూసర్వే పేరుతో పెద్దబాస్ ఆదేశాల మేరకు సచివాలయ సర్వేయర్లు ఇష్టానుసారంగా భూసర్వేలు నిర్వహించి అప్పటి అధికార పార్టీ నాయకుల పంచన చేరి వారు చెప్పినట్లు చేసి రైతులందరినీ గందరగోళంలోకి నెట్టారు. ఒక్క పాయలకుంట్ల పంచాయతీలోని కామకుంట, వేమకుంట రెవెన్యూ పొలంలో తరాల నుంచి సాగు చేసుకుంటున్న దాదాపు 300 ఎకరాల భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించి స్థానికేతరులకు, మంత్రుల అనుచరులకు, అధికార పార్టీ నాయకులకు పంచిపెట్టారు. అంతేకాకుండా పెద్దబాస్ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు సర్వేలు నిర్వహించి తప్పుడు సమాచారం ఆర్డీవోకు పంపినట్లు అప్పట్లో రైతులు చర్చించుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో అయినా రైతులకు మేలు జరుగుతుందని రైతులు ఎదురుచూస్తున్నారు.


కబ్జా చేసిన భూమికి ఏర్పాటు చేసిన కంచె


మంత్రి అనుచరులకు బి.కోడూరులో పట్టాలు

అప్పట్లో ఓ అధికారపార్టీ నాయకుడు మంత్రి అనుచరుడినని చెప్పుకొని పెద్దబాస్‌తో మాట్లాడుకోవడంతో స్థానికంగా సాగు చేసుకుంటున్న రైతుల భూములు ఆన్‌లైన్ నుంచి తొలగించి ఆ నాయకుడికి దాదాపు 30 ఎకరాల భూమిని అధికారులు కట్టబెట్టారు. అది ఏమిటని రైతులు అడిగేందుకు భయపడ్డారు. స్థానికంగా ఉండే రైతుల భూములు ఆన్‌లైన్ నుంచి తొలగించి ఎక్కడి నుంచో వచ్చిన అప్పటి అధికార పార్టీ నాయకునికి దాదాపు 30 ఎకరాలు కేటాయించి ఆన్‌లైన్ చేయడంలో మతలబు ఏమిటో అర్థం కావడం లేదు. 'ప్రజలు ఏమనుకుంటే మాకేంటి.. మేం అనుకునేదే జరగాలి' అనే ఒంటెద్దు పోకడలతో అప్పుడు అధికారులు వెళ్లినట్లు పలు విమర్శలున్నాయి.

టీడీపీ నాయకుల ఆందోళన

అప్పట్లో దుమారం రేగిన ఆన్‌లైన్ వ్యవహారం తప్పు అంటూ టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు స్థానికంగా ఉన్న రైతుల భూముల వద్ద ఆందోళన నిర్వహించారు. స్థానికేతరుడైన వైసీపీ నాయకుడికి దాదాపు 30 ఎకరాల భూమి ఎలా ఇస్తారంటూ వారు ప్రశ్నించారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ విషయమై బి.కోడూరు తహసీల్దారు మహేశ్వరిబాయిని వివరణ కోరగా, ఆన్‌లైన్‌లో భూములు ఎవరివి ఉన్నాయో వాటన్నింటినీ సర్వే చేయించి నివేదికను ఆర్డీవోకు పంపినట్లు తెలిపారు.

భూములను అన్యాయంగా తొలగించారు..



ఎన్నో ఏళ్లుగా వేమకుంట రెవెన్యూ గ్రామ సర్వే నెం.82/356లో 4.44 సెంట్ల భూమి సాగు చేసుకుంటూ ఉండేవారం. వైసీపీ ప్రభుత్వంలో భూసర్వే పేరుతో మా భూమి ఆన్‌లైన్‌లో లేకుండా చేశారు. ఇప్పడైనా మా భూమి ఉన్నది ఉన్నట్లు ఆన్‌లైన్‌లో ఎక్కించాలి. మాతో పాటు మా గ్రామంలో దాదాపు 300 ఎకరాలను ఆన్‌లైన్ నుంచి తొలగించారు. దీంతో బ్యాంకులో క్రాప్‌లోన్లు కూడా రెన్యువల్ చేయలేకపోతున్నాం. బ్యాంకు అధికారులు ఇంటి చుట్టూ తిరుగుతున్నారు.

- లక్కిరెడ్డి రాఘవరెడ్డి, రైతు, పాయలకుంట్ల


కబ్జాకు గురైన భూమిలో ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్)

పాత పద్ధతిలోనే ఆన్‌లైన్ చేయాలి..

పాత పద్ధతిలోనే రైతుల భూములు ఆన్‌లైన్ చేయాలి. భూసర్వే పేరుతో రైతులందరినీ గందరగోళంలోకి నెట్టారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో పాత పద్ధతిలోనే భూ ఆన్‌లైన్‌లు జరిపిస్తే బాగుంటుంది. రైతులు కూడా ఇబ్బందులు పడకుండా ఉంటారు. సచివాలయ సర్వేయర్లు సబ్ డివిజన్ అయి ఆన్‌లైన్ చేయించుకున్న భూములను కూడా తొలగించి పూరా నెం ఒకరి పేరు మీదనే ఆన్‌లైన్ చేశారు. దీంతో రైతులు ఎవరి భూమి ఎవరి పేరుతో ఉండేది తెలియక సచివాలయాల చుట్టూ తిరిగేవారు.

- కాసా వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్, పాయలకుంట్ల

మైపాడు బీచ్‌లో యువకుడు మృతి

కడప (క్రైం), జూన్ 23: నెల్లూరు జిల్లా మైపాడు బీచ్‌లో అలల తాకిడికి కడప ఏ1 నగర్‌కు చెందిన షేక్ ఇమ్రాన్ (20) మృతి చెందాడు. స్నేహితులతో కలిసి ఆదివారం మధ్యాహ్నం మైపాడు బీచ్‌కు విహారయాత్రకు సముద్రతీరానికి వెళ్లాడు. అక్కడ ఇమ్రాన్ సముద్రంలోకి వెళ్లడంతో అలల తాకిడికి కొట్టుకెళ్లి మృతిచెందినట్లు తెలిపారు. కడపలో ఆటో మెకానిక్‌గా పనిచేస్తున్న యూసఫ్ పెద్దకుమారుడిగా ఇమ్రాన్‌ను గుర్తించారు. దీంతో ఏపీజే అబ్దుల్ కలాం యూనియన్ నాయకులు రవికుమార్, ఇమ్రాన్ మృతికి సంతాపం తెలిపారు.


మృతి చెందిన షేక్ ఇమ్రాన్ ఫైల్‌ఫొటో

వైవీయూతో పద్మావతి వర్సిటీ ఎంఓయూ



ఎంఓయూలను మార్చుకుంటున్న వైవీయూ, పద్మావతి వర్సిటీ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 23: వైవీ యూ, తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయం మధ్య ఎంఓయూ కుదిరింది. వైవీ యూ రిజిస్ట్రారు ప్రొఫెసరు వెంకట సబ్బయ్య, వెపీ వెంకటసుబ్బయ్య, ఐటీ సెల్ డైరెక్టరు ప్రొఫెసరు తుమ్మలకుంట శివ, పద్మావతి వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు భారతి, రిజిస్ట్రార్ రజనీ ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. పద్మావతి వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు భారతి మా ట్లాడుతూ వైవీయూతో అనేక సాంకేతిక పర ప్రయోజనాలు పొందేందుకు ఒప్పందం చేసుకున్నామన్నారు, సీఏఎస్ ప్రమోషన్స్‌కు సంబంధంచిన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు సాంకేతికతను వినియోగించిన తొలి విశ్వవిద్యాలయంగా వైవీయూ ఉండడంతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు ఆమె వెల్లడించారు. వైవీయూ ఐటీ హబ్ సేవలను పొందుకున్నామని తెలిపారు. సీఏఎస్ ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని ఆకాంక్షించారు. వైవీయూ రిజిస్ట్రారు ప్రొఫెసరు వెంకట సుబ్బయ్య మాటాడుతూ ఐటీ హబ్ అందించే సేవల ద్వారా ఆర్థిక ప్రయోజనం యూనివర్శిటీకి అందుతుందన్నారు. ఐటీ హబ్ డైరెక్టరు తుమ్మలకుంట శివ మాట్లాడుతూ ఎంఓయూకు మూడేళ్ల కాలపరిమితి ఉంటుదన్నారు.రెండు యూనివర్శిటీల మధ్య సాంకేతికపరమైన సహాయ సహకారాలు అందుతాయన్నారు.

ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కాదివి కార్పొరేట్ ప్రభుత్వాలు

దొంగలు బాబోయ్ దొంగలు....

● తాళం వేసిన ఇళ్లే టార్గెట్

సింహాద్రిపురం, జూన్ 23: రైతుల పొలాల్లో తాళం వేసిన గొడౌన్, ఇళ్లే టార్గెట్‌గా చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల సింహాద్రిపురం మండలం బలపనూరు, అగ్రహారం తదితర గ్రామాల్లో తోటల్లో వున్న ఇళ్లలో రాత్రి వేళ దొంగలు చోరీకి యత్నించారు. శనివారం రాత్రి బలపనూరు వాసి హరి అనే రైతు తోటలో వున్న ఇంటి పక్కన షెడ్డుకు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. హరికి చెందిన బత్తాయి తోట పులివెందుల-సింహాద్రిపురం మెయిన్ రోడ్డు పక్కనే ఉంది. ఇలా రోడ్డు పక్కగల తోటల్లోనే చోరీ జరిగితే, ఇక మారుమూల తోటల్లోని ఇళ్ల పరిస్థితి ఏమిటని రైతుల్లో ఆందోళన మొదలైంది. గతంలో కూడా పలు మార్లు తోటల వద్ద వ్యవసాయానికి సంబంధించిన స్టార్టర్లు, మోటార్లు, కేబుల్ వైర్లు, డ్రిప్పు పరికరాలు, ప్లాస్టిక్ పైపులు రాత్రి వేళ దొంగలు తీసుకెళ్లారు. గతంలో పోలీసుల వద్దకు కూడా రైతులు ఈ విషయం తీసుకెళ్లారు. కానీ ఎలాంటి కేసులు నమోదు కాలేదు. పగలు అంతా పొలాల్లో కష్టపడి పని చేసి అలసిపోయిన రైతులు రాత్రి వేళ కూడా తోటల వద్ద తమ వ్యవసాయ పరికరాల కోసం కావలి కాయాలంటే సాధ్యమయ్యే పని కాదని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు తమ తోటల్లో చోరీ జరిగినా అవమానంగా ఫీల్ అవుతూ బయటకు చెప్పుకోలేకపోతున్నారు. పోయిన వస్తువులు మళ్లీ డబ్బు వెచ్చించి ఆ స్థానంలో కొత్త వస్తువులను సమకూర్చుకుంటున్నారు. పోలీసులు చర్యలు తీసుకుని దొంగతనాలు అరికట్టేలా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.

జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం ఎన్నిక



జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 23: జిల్లాలో బాల్‌బ్యాడ్మింటన్ అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం దొరసానిపల్లె జడ్పీ హైస్కూలులో ఉమ్మడి కడప జిల్లా బాలబ్యాడ్మింటన్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం, నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వై.క్రిష్ణమూర్తి (రాజంపేట), ప్రధాన కార్యదర్శి జి.వెంకటరమణ (ప్రొద్దుటూరు), కోశాధికారి శివనాగిరెడ్డి (కొండాపురం), ఉపాధ్యక్షుడు బాబాఫక్రుద్దీన్, సురేష్‌బాబు, రవీంద్రారెడ్డి, వెంకటమునిరత్నం, నాగముని, జాయింట్ సెక్రటరీలు నందకిశోర్‌కుమార్, ఇమామ్‌బాష, రాజశేఖర్, సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.


ఎన్‌పీఎల్ టోర్నమెంట్ విజేత మంటపంపల్లె



బహుమతి అందుకుంటున్న విజేత మంటపంపల్లె జట్టు

నందలూరు, జూన్ 23: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్ హార్డ్ టెన్నిస్‌బాల్ ఓపెన్-2 క్రికెట్ టోర్నమెంట్ విజేతగా మంటపం పల్లెకు చెందిన ముద్దుకృష్ణ జట్టు నిలిచింది. ఆదివారం ఉదయం బ్యాటింగ్ చేసిన గాంధీనగర్ జట్టు 13 ఓవర్లలో 79 పరుగులకు ఆలౌటైంది. 80 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన మంటపంపల్లె జట్టు 8.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 84 పరుగులు చేసి విజేతగా నిలిచింది. ఆ జట్టు బ్యాట్స్‌మెన్ హనుమంతరెడ్డి 63 పరుగులతో నాటౌట్‌గా నిలిచి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ సొంతం చేసుకున్నారు. మొదటి బహుమతి రూ.60,116 చెన్నయ్యగారి పల్లె వాసులు దేవిశెట్టి సుదర్శన్‌రాయల్, దేవిశెట్టి వంశీరాయల్ అందజేయగా, ఆ మొత్తాన్ని మల్లెం విజయ్ మంటపంపల్లె అందజేశారు. దివంగత వల్లి జ్ఞాపకార్థం వారి కుమారులు శోను, చోటులు రూ.40,116 ను రన్నర్స్‌గా నిలిచిన గాంధీనగర్ జట్టుకు అందజేశారు. జనాబ్ ఎస్‌టీ ఖాన్ చారిటుబల్ ట్రస్టు అధ్యక్షుడు, మండల కోఆప్షన్ సభ్యుడు కలీముల్లాఖాన్ దాదాపు 400 మందికి భోజన వసతి కల్పించారు. ఆర్గనైజర్లు గ్రీష్మంత్‌రెడ్డి, ముమ్మడి శెట్టి సుధాకర్, శివకోటి, రంజిత్, పత్తి శంకర, చందు పాల్గొన్నారు.

ఏడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పెండ్లిమర్రి, జూన్ 23: మండలంలోని పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను ఆదివారం ఎగువపల్లె క్రాస్ వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన అనిల్‌కుమార్, గోవర్థన్

సంబేపల్లె, జూన్ 23: దేవపట్ల శెట్టిపల్లె రోడ్డులో తాటికుంట హరిజన వాడ సమీపంలో జరిగిన ప్రమాదంలో అనిల్‌కుమార్, మదిరాల గోవర్ధన్‌కు గాయాలయ్యాయి. దుద్యాల గ్రామం పెద్దకోడివాండ్లపల్లె వాసి అనిల్ కుమార్, పెద్దజంగంపల్లికి చెందిన గోవర్ధన్ గుండ్రేవాండ్లపల్లె పాల డైరీకి ఆటోలో పాలు తరలిస్తుండగా దేవపట్ల వైపు నుంచి వస్తున్న డీజే వాహనం తాటికుంట హరిజన వాడ వద్ద ఆటో సైడు సౌండ్ బాక్స్ తగలడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. అనిల్‌కుమార్‌కు కాలు విరగ్గా, గోవర్ధన్‌కు చేతికి, మోకాలికి గాయాలయ్యాయి. గోవర్ధన్‌ను చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి, అనిల్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం కడపకు తరలించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

మదనపల్లె అర్బన్, జూన్23: రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థి మృతిచెందినట్లు మదనపల్లె తాలుకా సీఐ శేఖర్ తెలిపారు. మోతీనగర్ వాసి రిజ్వాన్ కుమారుడు అఫ్రష్ ఫార్మసీ కళాశాలలో చదువుతున్నాడు. శుక్రవారం కళాశాల వదలగానే ద్విచక్రవాహనంపై మదనపల్లెకు బయలుదేరాడు. సీటీఎం వద్ద ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీ కొనడంతో అఫ్రష్ గాయపడ్డాడు. వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

శ్మశానం ప్రహరీ తొలగింపు

అడ్డుకున్న స్థానికులు ● పోలీసు స్టేషన్‌కు ట్రాక్టర్ తరలింపు

ఉద్రిక్త వాతావరణం ● పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన సమస్య

సీకేదిన్నె, జూన్ 23: ఏడాది దాటినా బిల్లులు ఇవ్వలేదని శ్మశానం ప్రహరీని తొలగించి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామస్థులు అడ్డుకోవడంతో అప్పటి కాంట్రాక్టర్ తమకు డబ్బు ఇవ్వలేదని, మెటీరియల్ తీసుకెళ్లాలని చెప్పడంతో తీసుకెళుతున్నట్లు చెప్పారు. ఇది ప్రభుత్వ ఆస్తి, ప్రజల ఆస్తి, ఇలా తొలగించేందుకు వీలుకాదని గ్రామస్థులు అడ్డుకుని చివరకు పోలీసులకు అప్పగించారు. పోలీసు స్టేషన్‌కు ఏఈని పిలిపించి విచారించగా అందుకు సంబంధించి బిల్లులు గతంలో మంజూరయ్యాయని చెప్పారు. దీంతో పోలీసులు ఆ మెటీరియల్ తెచ్చిన చోటే పెట్టాలని ఆదేశించడంతో వాటిని యథాస్థానంలో పెట్టడంతో కథ సుఖాంతమైంది. వివరాల్లోకెళితే...

చింతకొమ్మదిన్నె మండలం కార్పొరేషన్‌లో విలీనమైన మామిళ్లపల్లె పంచాయతీ 16వ డివిజన్ బలిజపల్లె, సుగాలితండా శ్మశాన వాటికను రక్షించేందుకు గతేడాది సుమారు రూ.2లక్షలతో రెడిమేడ్ పలకలతో ప్రహరీ నిర్మించారు. అయితే అప్పటి నుంచి ప్రీకాస్ట్ మెటీరియల్ తయారు చేసేవారికి బిల్లులు ఇవ్వకపోవడంతో ఆదివారం ఉదయం వారు వచ్చి మెటీరియల్‌ను ట్రాక్టర్‌లో ఎత్తుకుపోతుండడంతో గ్రామస్థులు అడ్డుకుని ప్రహరీ పలకలను తరలించేందుకు వీలులేదన్నారు. దీంతో ఇతర రాష్ట్రాల మెటీరియల్ కాంట్రాక్టర్ వైసీపీ ప్రభుత్వంలో తమకు అడ్వాన్సు మాత్రమే ఇచ్చి మెటీరియల్ తెచ్చుకున్నారని, అప్పటి వైసీపీ కాంట్రాక్టర్ పనులు చేయించుకుని డబ్బు ఇవ్వకపోవడంతో డబ్బు ఇవ్వాలని పలుమార్లు అడిగినా బిల్లులు రాలేదని సమాధానం ఇచ్చేవారని తెలిపారు. శనివారం డబ్బు అడగడంతో ప్రభుత్వం నుంచి డబ్బు రాలేదు, మీ మెటీరియల్ మీరు తీసుకెళ్లండని చెప్పడంతో ఆదివారం మెటీరియల్ తీసుకెళ్లేందుకు వచ్చినట్లు వారు గ్రామస్థులకు తెలిపారు. ట్రాక్టర్‌కు ఎత్తించిన మెటీరియల్, ట్రాక్టర్‌ను గ్రామస్థులు పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు ఏఈని పిలిపించి విచారించగా గతంలోనే ఈ ప్రహరీ బిల్లులు మంజూరు చేశారన్నారు. దీంతో పోలీసులు చొరవ తీసుకుని ఆ మెటీరియల్‌ను కాంట్రాక్టర్‌తో ఎక్కడి వస్తువులు అక్కడే పెట్టాలని సూచించడంతో తిరిగి శ్మశానం వద్ద యథాస్థానంలో పెట్టడంతో ప్రజలు శాంతించారు.



శ్మశాన ప్రహరీని తొలగిస్తుండటంతో అడ్డుకున్న గ్రామస్థులు

ఉద్రిక్త వాతావరణం

ఒక్కసారిగా ఉన్నట్టుండి శ్మశానం గోడలు తొలగిస్తున్న విషయాన్ని అటుగా బహిర్భూమికి వెళ్లిన కొందరు గమనించి గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో గ్రామస్థులంతా వచ్చి వారిని అడ్డుకున్నారు. తమకు బిల్లులు ఇవ్వలేదని, మెటీరియల్ తీసుకెళుతున్నట్లు గ్రామస్థులకు తెలపడంతో కొంత సేపు గ్రామస్థులకు, ఇతర రాష్ట్రాలకు చెందిన మెటీరియల్ ప్రీకాస్ట్ కాంట్రాక్టర్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్నట్లు గ్రామస్థులు తెలిపారు. అక్కడికి గ్రామస్థులు అధిక సంఖ్యలో రావడంతో వెనక్కు తగ్గిన కాంట్రాక్టర్ అప్పటి వైసీపీ ప్రభుత్వంలో వర్కులు చేయించుకుని బిల్లులు ఇవ్వలేదని, బిల్లు అడిగితే మెటీరియల్ తీసుకెళ్లాలని చెప్పడంతోనే మెటీరియల్ తీసుకెళ్లేందుకు వచ్చినట్లు తెలిపారు. చివరకు పోలీసుల జోక్యంతో గ్రామస్థులు శాంతించారు.

వైసీపీ మార్కు రాజకీయం

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ శ్మశాన ప్రహరీ నిర్మాణానికి రూ.2 లక్షలకు నిధులు మంజూరై బిల్లులు వచ్చినప్పటికీ ఆ బిల్లులను స్థానిక వైసీపీకి చెందిన ఓ కాంట్రాక్టర్ నొక్కేశారు. పైగా బిల్లులు రాలేదంటూ కాకమ్మ కబుర్లు చెబుతూ మెటీరియల్ కాంట్రాక్టర్లను తన చుట్టూ తిప్పుకుని చివరకు మీ సామాన్లు మీరు తీసుకెళ్లండని చెప్పడం పట్ల గ్రామస్థులు ఆశ్చర్యంతో ఇదేమి చోద్యం అంటూ గుసగుసలాడుకుంటున్నట్లు తెలుస్తోంది. చివరకు మండల వ్యాప్తంగా ఇది హాట్‌టాపిక్‌గా మారినట్లు సమాచారం.

వైఎస్ఆర్ జిల్లా పేరులో కడపను చేర్చాలి

● *రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిల పక్ష నేతల డిమాండ్*



సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 23: వైఎస్ఆర్ జిల్లా పేరులో కడపను చేర్చాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా కడప ఏర్పడి 200 ఏళ్లయిందన్నారు. 20 ఏళ్ల కిందట దివంగత సీఎం డాక్టర్ వైఎస్ఆర్ ద్విశతాబ్ధి ఉత్సవాల పేరుతో కడప చరిత్ర సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. అయితే ఆయన మరణానంతరం కడప పేరును తొలగించి చరిత్ర ఆనవాళ్లే లేకుండా చేసి చారిత్రక తప్పిదం చేశారని ఆరోపించారు. జిల్లా పేరులో తిరిగి కడపను చేర్చి తప్పిదాన్ని సరిదిద్దాలని డిమాండ్ చేశారు. ఒక పరిపాలన కేంద్రంగా కడపకు 200 ఏళ్ల గుర్తింపు ఉన్నా నిజానికి చరిత్రలో కడప అనే పేరు శతాబ్ధాల నుంచీ ఉనికిలో ఉందన్నారు. ఇక్కడి ప్రజల విశ్వాసాల ప్రకారం మెకంజీ, కైఫీయత్తుల ప్రకారం కడప అంటే వెంకటేశ్వరుడి గడప, ఖచ్చితమైన చారిత్రకాధారాల ప్రకారం క్రీస్తు శకం 971 నాటికి కడప ప్రాదేశిక విభాగంగా ఉనికిలో ఉన్నట్లు వైదుంబ రాజవంశజులు భువన త్రినేత్ర అనే రాజు అత్తిరాలలో వేయించిన రాగి శాసనం ద్వారా తెలుస్తోందన్నారు. కడప జిల్లా ఒకప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని రాయలసీమలో అతిపెద్ద ప్రాంతమన్నారు. బళ్లారి సరిహద్దునుంచి ఇప్పటి అనంతపురం, చిత్తూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో చాలా ప్రాంతాలు ఒకప్పుడు కడప జిల్లాలో భాగమే. ఇక్కడ సకల వెనుకబాటు తనాలు, గొప్ప దేశీయ సంప్రదాయాలు కూడా ఉన్నాయన్నారు. నాచన సోమనాథుడు అల్లసాని పెద్దన, సూరన కవి, ఈశ్వరీదేవి సాహిత్య వారసత్వం ఉందని, పండితలోగిళ్ల నుంచి తాళ్లపాక అన్నమయ్య, తేనెపలుకుల పదాల్లో, ప్రజా కవి వేమన, బ్రాహ్మణీయ సంస్కృతిని నిలదీసిన వీరబ్రహ్మం ఈ ప్రాంతీయులేనన్నారు. పోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞానం ఈ నేలలో ఉందని, తెలుగుసినిమా స్వర్ణయుగం నాటికళాకారులు బీఎన్‌రెడ్డి, బి.నాగిరెడ్డి, శాంతకుమారి జిల్లావాసులేనన్నారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ నేత డాక్టర్ తులసిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, చేతివృత్తుల జాతీయ సమాఖ్య నేత అవ్వారు మల్లికార్జున, ఆప్ నేత డాక్టర్ శ్రీనివాసులు, విరసం వరలక్ష్మి ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు ఎన్.వెకటశివారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, బషీరున్నీసా, బాదుల్లా, సావంత్ సుధాకర్, రమణ, మునెయ్య, ఇమ్మనుయేల్, సత్తార్, ఆర్‌సీపీ ప్రసాద్, శివారెడ్డి, విష్ణునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుని అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 23: స్థానిక రామేశ్వరం రోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన యువకుడి హత్య కేసులో నిందితుడు వెంకటసుబ్బయ్యను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. పూర్తి వివరాల్లోకి వెళితే... దర్గాబజార్ వాసి ఆర్షద్ శుక్రవారం రాత్రి మద్యం తాగి రామేశ్వరం రోడ్డులో కిందపడిపోయాడు. ఈ క్రమంలో అతన్ని బండరాయితో కొట్టి హత్య చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. షేక్ అర్షద్ స్థానిక పుల్లయ్య సత్రం సోమ వెంకట సుబ్బయ్య మధ్య గతంలో గొడవ జరిగింది. అక్రమంలో వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులను షేక్ అర్షద్ అసభ్య పదజాలంతో తిట్టారు. దీన్ని మనసులో పెట్టుకున్న వెంకటసుబ్బయ్య మద్యం దుకాణం సమీపంలో పడిపోయి వున్న అర్షద్‌ను గమనించి అతని తనపై బండరాయితో కొట్టి చంపినట్లు విచారణలో తెలిసినట్లు సీఐ తెలిపారు. ఈ క్రమంలో వెంకటసుబ్బయ్యను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ తెలియజేశారు.

దేవగుడిలో ఘర్షణ - ఇద్దరికి గాయాలు

జమ్మలమడుగు, జూన్ 23: దేవగుడి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం బీజేపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితుడు సునీల్ విలేకరులతో మాట్లాడుతూ దేవగుడిలో వైసీపీ వర్గీయులు ఎర్రచ్చమ్మగారి చిన్న ఓబయ్య, పెద్ద ఓబయ్య, ఓబులేసు (గుండు)తోపాటు మొత్తం 11 మంది రాళ్లతో దాడి చేశారన్నారు. ఈ ఘటనలో సునీల్, రాజేష్, బీజేపీ వర్గీయులు గాయపడ్డారు. గాయపడినవారు జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి ఆస్పత్రిలో చికిత్స పొంది సాయంత్రం ఆస్పత్రిలో చికిత్స పొందారు. సమాచారం తెలుసుకున్న అర్బన్ పోలీసులు గ్రామాన్ని సందర్శించి విచారణ చేసినట్లు తెలుస్తోంది. బీజేపీ వర్గీయులైన సునీల్‌కు తలకు తీవ్ర గాయం కాగా ఏడు కుట్లు పడినట్లు బాధితుడు తెలిపారు. రాజేష్ అనే వ్యక్తికి కాలికి గాయమైంది. ప్రత్యర్థులకు స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబందించి జమ్మలమడుగు అర్బన్ సీఐ కరుణాకర్‌ను 'ఆంధ్రజ్యోతి' కేసుకు సంబందించిన వివరాలను అడుగగా ఆలస్యం అవుతోందని తెలిపారు. బాధితులైతే సాయంత్రం అయిదు గంటలకే పోలీసు స్టేషన్‌లో 11 మందిపై ఫిర్యాదు చేసినట్లు సునీల్ అనే బాధితుడు తెలిపారు.

మంత్రిని కలిసిన ప్రసాద్‌బాబు



రాయచోటిటౌన్, జూన్23: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు, రాయచోటి టీడీపీ నేత సుగవాసి ప్రసాద్‌బాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టి నూతన కార్యాలయంలో అడుగుపెడుతున్న సందర్భంలో మంత్రిని రాష్ట్ర రాజధాని అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ట్రిపుల్‌ఐటీ సెక్యూరిటీ గార్డు మృతి



రాజుప్రసాద్ మృతదేహం

వేంపల్లె, జూన్ 23: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సెక్యూరిటీ గార్డు రాజుప్రసాద్ (30) మృతిచెందాడు. ట్రిపుల్‌ఐటీకి బైకులో విధులకు వెళుతూ వేంపల్లె-ట్రిపుల్‌ఐటీలో రోడ్డులోని వైఎస్సార్ ఘాట్ సమీపంలో అదుపుతప్పి కిందపడడంతో మృతిచెందాడు. భార్య గీత ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రంగారావు, హెడ్‌కానిస్టేబుల్ సుందరం కేసు నమోదుచేశారు. వివరాలిలా ఉన్నాయి. పులివెందుల వాసి రాజుప్రసాద్ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. ఏడాది కిందట చక్రాయపేట మండ లం కుమార్లకాల్వకు చెందిన గీతతో వివాహమైంది. భార్య, తల్లితో కలిసి వేంపల్లెలో నివాసముంటున్నాడు. ఆదివారం ట్రిపుల్‌ఐటీలో డ్యూటీ నిమిత్తం బైకులో వెళ్తుండగా అదుపుతప్పి పడడంతో తలకు గాయమైంది. ఆస్పత్రికి తీసుకొచ్చేలోపే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. డ్యూటీకి వెళ్తూ అనుకోని ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. భార్య గర్భవతి కావడం, భర్త చనిపోవడంతో అయ్యోపాపం అంటూ ఆవేదన వెలిబుచ్చారు.

మెడిసిన్ విద్యార్థిని మృతి

● యాజమాన్యం నిర్లక్ష్యంతో
మా కుమార్తె మృతి : తల్లిదండ్రులు



సృజని (ఫైల్ ఫొటో)

ఎర్రగుంట్ల, జూన్ 23: కర్ణాటక రాష్ట్రంలోని ఓ కళాశాలలో మెడిసిన్ పీజీ విద్యార్థిని పివీ సృజని(27) అనారోగ్యంతో మృతి చెందింది. కడప జిల్లా ఎర్రగుంట్ల మాజీ జడ్పీటీసీ పి.మాధురి, వెంకటరమణారెడ్డి కుమార్తె సృజని కర్ణాటక మంగుళూరు సమీప సుల్లియాలోని కాలేజిలో చదువుతోంది. నాలుగురోజుల కిందట జ్వరం వచ్చింది. అయితే రక్త పరీక్షలు చేయగా డెంగ్యూ సోకడంతో ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయి. కాలేజిలో సరైన వైద్యం అందకపోవడంతో ప్లేట్‌లెట్స్ బాగా తగ్గి పరిస్థితి విషమించింది. ఆ విషయాన్ని అర్ధరాత్రి దాటిన తర్వాత కాలేజి యాజమాన్యం సృజని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. హైదరాబాదు సనత్‌నగర్‌లో నివాసం ఉంటున్న వారు వెనువెంటనే బయలు దేరారు. అయితే సృజని ఆరోగ్యవిషయంలో కాలేజి వైద్యులు చేతులెత్తేసి మెరుగైన వైద్యం కోసం మంగుళూరుకు వెళ్లాలని చెప్పడంతో ఆమెను మంగుళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో కోమా స్థితికి చేరుకుంది. తల్లిదండ్రులు చేరుకుని కోమాలో కొన ఊపిరితో ఉన్న తమ కుమార్తెను చూసి వారు తల్లడిల్లిపోయారు. చివరి మాటలకు కూడా నోచుకోలేదని విలపించారు. 21వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు మృతిచెందిందని తెల్లిదండ్రులు తెలిపారు. ఈవిషయాన్ని వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కాలేజివద్దకు వెళ్లి విచారణచేయగా కాలేజి యాజమాన్యం ట్రీట్‌మెంట్ విషయంలో సరైన సమాధానం చెప్పలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. ఆదివారం తెల్లవారు జామున స్వగ్రామం కడప జిల్లా పోట్లదుర్తికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రతిభాశాలిగా గుర్తింపు

సృజని చదువులో మంచి ప్రతిభాశాలి. ఇంటర్ పూర్తయిన తర్వాత మొదటి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీటును హైదరాబాదులోని గాంధీమెడికల్ కాలే జిలో సంపాదించింది. అక్కడ ఎంబీబీఎస్ పూర్తిచేసి ఎంఎస్ గైనకాలజిస్ట్ సీటును సుల్లియా కళాశాలలో పొందింది.

శోకసంద్రంలో తల్లిదండ్రులు, బంధువులు

మాజీ జడ్పీటీసీ పి.మాధురి, వెంకటరమణారెడ్డి కుమార్తె సృజని మరణవార్తను తెలుసుకున్న గ్రామ వాసులు, బంధువులు పెద్దఎత్తున చేరుకుని దుఃఖసాగరంలో ఉన్న తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరికీ సాధ్యంకాలేదు. త్వరలో ఎంఎస్ పూర్తిచేసుకుని వస్తుందని కోటి ఆశలతో ఉన్న తల్లిదండ్రులకు సృజని మృతి తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది. ఎంఎస్ చేస్తున్న వైద్య విద్యార్థిని పట్లనే కాలేజివారు ఇంతటి నిర్లక్ష్యం చేస్తే ఇక సామాన్య ప్రజలకు ఎలాగని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు.

బీసీల్లో సామాజిక చైతన్యం పెంపొందాలి

దేవాంగ ప్రతిభా పురస్కార సభలో
హైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్

ప్రొద్దుటూరు జూన్ 23: కేంద్రం, రాష్ట్రంలో కొలువుతీరిన ప్రభుత్వాలు ప్రజాస్వామ్య ప్రభుత్వాలుగా కనపడుతున్నా ఇవి కార్పొరేట్ ప్రభుత్వాలని ప్రముఖహైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవాంగ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించిన ఆయన మాట్లాడుతూ బీసీలకు విద్యతో పాటు సామాజిక రాజకీయ హక్కుల్లో చైతన్యం పెంపొందించాలన్నారు. నాడు కూడు, గూడు, గుడ్డ వుంటే చాలనే దగ్గరినుంచి నేడు విద్య వైద్యం ప్రధానమయ్యాయన్నారు. కానీ విద్య, వైద్యం ప్రభుత్వ రంగం నుంచి ప్రైవేటు రంగంలోకి వెళ్ళి పోవడంతో అణగారిన వర్గాలకు ఖరీదయ్యాయన్నారు. అందుకే నేడు రాజ్యాంగ హక్కుగా పోరాడాల్సిన అవసరం వుందన్నారు. హ్యాడ్‌లూమ్ టెక్స్‌టైల్స్ రీజనల్ డైరెక్టర్ గుత్తి రాజారావు మాట్లాడుతూ కూటికి లేని స్థితి నుంచి చేనేత బతుకులు నేడు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఏలూరు జిల్లా పంచాయతీ రాజ్ అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ వాట్సప్ ఫేస్‌బుక్ ట్విట్టర్ ఇంటర్నెట్ సోషల్ మీడియాకు ప్రాధాన్యత నిస్తే మన జీవితం నాశనం అవుతుందన్నారు. చదువుకోవడం కష్టమన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే విద్య జీవితాన్ని ఇస్తుందన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ మనకు ఆదర్శ గురువులన్నారు. టైలర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆకాశపు స్వామి, దేవాంగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుచ్చల రామక్రిష్ణ, మీడియా సెల్ అధ్యక్షుడు గుత్తిత్యా గరాజు, దేవాంగసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉట్టి నాగశయనం మాట్లాడారు. 65 మంది దేవాంగ విద్యార్థులకు ప్రథమ బహుమతిగా ఐదువేలు, ద్వితీయ బహుమతిగా 4 వేలు తృతీయ బహుమతిగా 3 వేలు, 55మందికి కన్సొలేషన్ బహుమతులు అందించారు. సంఘం నేతలు వెంకటసుబ్బయ్య, విశ్రాంత ఎస్ఈ, ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య కల్యాణ మండపం అధ్యక్షుడు రెడ్డిచంద్రశేఖర, సుబ్రమణ్యం, ఉట్టి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను వెంటనే తెరవాలి



చింతకొమ్మదిన్నె బీసీ హాస్టల్ వద్ద విద్యార్థి సంఘం నాయకులు

సీకేదిన్నె, జూన్ 23: మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో మూతపడిన బీసీ హాస్టల్‌ను తెరవాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో మూసివేతకు కారణమైన హాస్టల్‌వార్డెన్ రఘురామరాజును సస్పెండ్ చేసి బీసీ హాస్టల్ తెరపించి విద్యార్థులకు అనుకూలంగా ఉంచాలని విద్యార్థి యువజన సంఘ నాయకులు ఆదివారం డిమాండ్ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన వార్డన్ పలుచోట్ల మూసివేతకు కారణం అయ్యాడని, హాస్టళ్ల అభివృద్ధి పరచకుండా అక్కడ విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి చివరికి మూతపడిపోయేస్థితికి వస్తున్న రఘురామిరెడ్డిని సస్పెండ్‌చేసి అతని అవినీతిపై విచారణ చేపట్టాలని కోరారు. విద్యార్థి సంఘం నాయకులు సుబ్బరాయుడు, బాస్కర్, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

పద్మశాలీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గునిశెట్టి



పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

కడప (ఎడ్యుకేషన్), జూన్ 23 :పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం చిన్నచౌకు పద్మశాలీ భవన్‌లో పద్మశాలలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ విజయకుమార్, కోశాధికారిగా అవ్వారు రమేశ్ ఎంపికయ్యారు.మహిళా విభాగం అధ్యక్షురాలిగా జనపాటి వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా అనిత చెన్న విజయలక్ష్మి ఎంపికయ్యారు. రాష్ట్రశాఖ ప్రతినిధిగా సోము జ్ఞానశంకర్, ఉపాధ్యక్షులుగా మాధవ, తిరుమలకొండు సహాయ కార్యదర్శులుగా లోకేశ్, మల్లికార్జున, నల్లి పవన్, కార్యవర్గసభ్యులుగా డాక్టర్ వెంకటసుబ్బయ్య, క్రిష్ణయ్య ఎంపికయ్యారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

వేముల, జూన్ 23: ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనే కార్యక్రమాన్ని సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.

ఆగిపోయిన జాతీయ రహదారి పనులు

- ప్రయాణికులకు ఇక్కట్లు
- పట్టించుకునే నాథుడు కరువు
- త్వరగా బాగుచేయాలని వినతి

చక్రాయపేట, జూన్ 23: వీరన్నగట్టు నుంచి రాయచోటి వరకు జాతీయ రహదారి (44) పనులు మంజూరయ్యాయి. దాదాపు మూడేళ్ల క్రితం రూ.450 కోట్లతో రోడ్డు పనులు మంజూరు కావడం అప్పట్లో ఎస్ఆర్‌కే కంపెనీ పనులు దక్కించుకొనిపనులు వేగవంతం చేశారు. అనంతరం ఏడాది తర్వాత కాంట్రాక్టర్ అనారోగ్యంతో మృతిచెందడంతో అక్కడ నుంచి పనులకు గ్రహణం పట్టింది. ఏడాది గడిచిన తర్వాత పనులు చేతులమారాయి. కొత్త కాంట్రాక్టర్ వచ్చారు. నెలపాటు అక్కడక్కడ చిన్నచిన్న పనులు చేశారు. అనంతరం ఆ పనులు ఆగిపోయా యి. వీరన్నగట్టుపల్లె నుంచి రాయచోటికి వాహనాలు వెళ్లాలంటే భూలోకంలో యమలోకం కనిపిస్తుంది. పనులు అక్కడక్కడ జరిగాయి. ఎక్కడ చూసినా కల్వర్టులు తవ్విపెట్టారు. కొన్నిచోట్ల కంకరపరిచారు. కొన్నిచోట్ల మట్టిరోడ్డు వేశారు. కొన్నిచోట్ల తారురోడ్డు వేశారు. తర్వాత ఎన్నికలు రావడం, పనులు ఆగిపోవడం జరిగింది. కానీ ఈ పనులు జరిగిన రోడ్డు పనులు పూర్తవుతాయా అని ప్రజలు సందేహం వ్యక్తం చేశారు. దాదాపు రూ.450 కోట్లతో ప్రారంభించిన పనులు మూడేళ్లుగా జరుగుతుండడం గమనార్హం. స్వయాన అప్పటి ముఖ్యమంత్రి ప్రాతినిత్యం వహిస్తున్న నియోజకవర్గం నుంచే పనులు మొదలు పెట్టిన పూర్తికాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన పనులు ఎవరు దక్కించుకుంటారో తెలియలేదు. ఇప్పటికే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఆంజనేయపురం, చక్రాయపేట వద్ద మరింత అధ్వానంగా రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మారెళ్లమడక సమీపాన మట్టిరోడ్డు వేయడంతో వానలకు గుంతలుగా తయారైంది. ఓబుళనాయునిపల్లె నుంచి చక్రాయపేట బైపాస్ మీదుగా కిలోమీటర్ కంకరపరిచారు, మరో కిలోమీటర్ రోడ్డు వేశారు. ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని పనులు వేగవంతం చేసి ప్రజలకు మంచి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



చక్రాయపేట సమీపాన బ్రిడ్జి తవ్వేందుకు తీసిన గుంతలు

రోడ్డు బాగు చేయాలి



నేను శాంతినికేతన్ పాఠశాలకు పిల్లలను తీసుకెళ్లడానికి కొత్తగా స్కూల్ వ్యాన్ కొన్నాను. కొన్న ఏడాదిలోనే రోడ్డు కారణంగా పూర్తిగా వాహనం దెబ్బతినింది. ఈ రోడ్డున వెళ్లాలంటేనే భయమేస్తోంది. బస్సులు కూడా చాలా వరకు తీసేశారు. అడుగడుగున గుంతలే. ఈ రోడ్డున వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు.

- వెంకటకృష్ణ, దేవరగుట్టపల్లె







కొండప్పగారిపల్లె సమీపాన బ్రిడ్జి నిర్మించకపోవడంతో పక్కనవెళ్తున్న వాహనాలు...ఆంజనేయపురం సమీపాన గుంతలు ఏర్పడడంతో నిలిచిన వర్షపునీరు.. చక్రాయపేట సమీపాన కంకరపరిచిన దృశ్యం

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూన్ 23 :రాష్ట్రప్రభుత్వ ఉద్యోగ ఉపాధి పెన్షనర్లకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ అమలులో జాప్యం జరిగే అవకాశం ఉన్నందున వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. 11వ పీఆర్సీలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయారన్నారు. 12వ పీఆర్సీని మెరుగైన ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలని 11వ పీఆర్సీ బకాయిలను కరువు భత్యం బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను విభజించి ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమయ్యాయని, దానికి ప్రధాన కారణమైన జీఓ నెం.17 రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను గతంలో మాదిరిగానే కొనసాగించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లులకు మాత్రమే తల్లికి వందనం పథకం కింద నిధులు చెల్లించాలని కోరారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు క్రిష్ణారెడ్డి, గురయ్య, బాస్కర్‌రెడ్డి, జిల్లా నాయకులు రాంభూపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాలజోజి, అబ్దుల్‌సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు ముస్లిం మైనార్టీల కృతజ్ఞతలు

కడప (నాగరాజుపేట), జూన్ 23: ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడికి ముస్లిం మైనార్టీ తరపు నుంచి కృతజ్ఞతలు తెలుపుతున్నామని టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు తెలిపారు. నగరంలోని 27వ డివిజన్ గౌస్ నగర్ ఆఫీసులో ఆదివారం టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు శపథం నెరవేరేలా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన శుభసందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు అమానుల్లా, షేక్ లయన్ పఠాన్ ఖాదర్‌బాషా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే తొలుత ఐదు సంతకాలు చేయడం జరిగిందని, అందులో భాగంగా పేద విద్యార్థులకు ఉన్నత విద్య కోసం అందించే పథకాన్ని పూర్వ రాష్ట్రపతి మిస్సైల్ మాన్‌గా పేరుగాంచిన శాస్త్రవేత్త ఏపీజే అబుల్‌కలాం పేరుతో మైనార్టీ విద్యార్థులు అందుకోనుండగా దళిత విద్యార్థులు భారత రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరుతో అందుకోనున్నారని, యావత్తు దళిత ముస్లిం వర్గాలు హర్షధ్వానాలతో కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



పులివెందుల రూరల్, జూన్ 23: పులివెందుల పట్టణంలోని ఉలిమెల్ల లేక్‌ఫ్రంట్‌లో ఏర్పాటుచేసిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. ఆదివారం పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణలో యువరాజ డ్యాన్సింగ్ స్కూల్ బృందంచే నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. మహా గణపతిమ్ మనసా స్మరామి అంటూ సాగే పాటతో మొదలై సొమ్మసిల్లి పోతున్నావే ఓ సిన్నా రాములమ్మ, నా కాళ్లు చెబుతున్నాయి అంటూ సాగిన ఉత్సాహ భరిత పాటలకు స్టెప్పులేశారు.

బోయకొండ గంగమ్మ సన్నిధిలో పుత్తా కుటుంబం



అమ్మవారిని దర్శించుకుంటున్న పుత్తా కుటుంబ సభ్యులు

కమలాపురం రూరల్, జూన్ 23 : చిత్తూరు జిల్లా పుంగనూరు సమీపంలో వెలసిన బో య కొండ గంగమ్మను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశా రు. ఆదివారం కమలాపురం పట్టణానికి చెందిన కంకరసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు తమ కోరికలు నెరవేరితే మొక్కు చెల్లించుకుంటామని మొక్కుకున్నారు. ఆ మొక్కుబడి తీర్చుకునేందుకు అక్కడికి వెళ్లారు. వారి ఆహ్వానం మేరకు పుత్తా నరసింహారెడ్డి కుటుంబ సభ్యులకు యువ నాయకుడు పుత్తా లక్ష్మిరెడ్డి, పుత్తా సాయి నరసింహారెడ్డి అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు కుటుంబ సభ్యులకు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే వేద పండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న గ్రేటర్ వాసవీ క్లబ్ సభ్యులు

కమలాపురం రూరల్, జూన్ 23 : కమలాపురం వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో గ్రేటర్ వాసవీ క్లబ్ సేవా ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశామని గ్రేటర్ వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బచ్చు వెంకట సుబ్రమణ్యం, గాజులపల్లె చంద్రశేఖర్ గుప్త తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలాపురం పట్టణంలో చాలామంది పేద విద్యార్థులు ఉన్నారని, వారి తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నార న్నారు. అలాంటి పరిస్థితుల్లో చదువుకు దూరం అయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రతి పిల్లవాడు బడికి వెళ్లి చదువుకోవాలనే ఉద్దేశ్యంతో గ్రేటర్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పిల్లలకు నోట్‌బుక్స్, చిరువ్యాపారస్తులకు గొడుగులు పంపిణీ చేశామన్నారు. ట్రెజరర్ బోజనపాటి సుధాకర్‌బాబు, మెంబర్స్ రెడ్డి సురేష్, కామిశెట్టి కళ్యాణచక్రవర్తి, తల్లం రజినీ, నామా బచ్చు జనార్ధన్, భూపాలం శివరామక్రిష్ణ పాల్గొన్నారు.

భూముల వేలం పాట రూ.90వేలు



నంద్యాలంపల్లిలో వేలం పాట అనంతరం ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న గ్రామ పెద్దలు

సింహాద్రిపురం, జూన్ 23: మండలంలోని నంద్యాలంపల్లి గ్రామంలోని శ్రీరాముడి దేవాలయానికి చెందిన ఏడు ఎకరాల పొలంకు రూ. 90 వేలు వేలం పాట పలికింది. ఆదివారం సింహాద్రిపురం పోలీసుల సమక్షంలో ఈ వేలం పాట నిర్వహించారు. గతంలో ఈ ఏడు ఎకరాల పొలం గ్రామ వైసీపీ నాయకుల ఆధీనంలో వుండేది. నేడు జరిగిన వేలం పాటలో గ్రామ టీడీపీ నాయకుల ఆధీనంలోకి స్వామి వారి పొలం వచ్చింది. వేలం పాటలో వచ్చిన మొత్తాన్ని బ్యాంక్‌లో డిపాజిట్ చేసినట్లు తెలిపారు.

నిలిచిపోయిన పనులు ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాదుల్లా

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 23 : గ్రామీణ పంచాయతీల్లో స్వచ్ఛభారత్ మిషన్ కింద పనిచేసే కార్మికులకు నిలిచిపోయిన పనులు తిరిగి ప్రారంభించేటట్లు ఆదేశాలు ఇవ్వాలని నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ (ఏఐటీ యూసీ) గౌరవ అధ్యక్షుడు కేసీ బాదుల్లా విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక హోచిమన్ భవన్‌లో స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ సమావేశం యూనియన్ ఉపాధ్యక్షుడు ఆనందయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాదుల్లా మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులతో పేరు మార్చి జగనన్నక్లాప్ మిత్రలుగా పనులు చేయించుకుని వేతనాలు మాత్రం ఆరు నెలల నుంచి 20 నెలల తరబడి పెండింగులో ఉంచిన చరిత్ర గత సీ ఎం జగన్‌కు దక్కిందన్నారు. జీఓ నెం.680 ప్రకారం కనీస వేతనం రూ.10వేలు ఇచ్చి కార్మికుల భద్రత కల్పించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ ఉద్యమపథంలో ఎస్టీయూ పాత్ర అద్వితీయం

పులివెందుల టౌన్,జూన్ 23: ఉపాధ్యాయ ఉద్యమపథంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం పాత్ర అద్వితీయమైనదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో సొంత భవనంలో ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. మొదటి పేరివిజన్ సాధనలోను, త్రిపుల్ బెనిఫిట్ స్కీమ్ సాధించిపెట్టడంలో, అలాగే అప్రెంటిస్ విధానాన్ని రద్దుచేయించడంలో ఎస్టీయూలోని నాటినేత వీణా విజయరామరాజు నుంచి నేటి నేత కత్తి నరసింహారెడ్డి వరకు వారి పాత్ర అసామాన్యమైందన్నారు.


రామాలయానికి వీడనున్న రాజకీయ గ్రహణం?



పనులు జరగకుండా అసంపూర్తిగా నిలిచిన రామాలయం

చక్రాయపేట, జూన్ 23: ఆలయానికి కూడా రాజకీయ గ్రహణం పట్టిందని చక్రాయపేట మండల టీడీపీ అధ్యక్షుడు తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. చాలా కాలంగా ఆగిపోయిన ఆ ఆలయ పనులను ఆయన తిరిగి ప్రారంభించేందుకు సంకల్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అతిపెద్ద గ్రామమైన సురభి గ్రామంలో గతంలో టీడీపీ ప్రభుత్వంలో రామాలయాన్ని నిర్మించాలని సంకల్పించారు. టీటీడీ మ్యూచ్యువల్ గ్రాంట్‌తో (టీటీడీ 80శాతం నిధులు) నిధులు మంజూరు చేయించి పనులు మొ దలుపెట్టి దాదాపు సగభాగం నిర్మించారు. అంతలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీటీడీ నుంచి వచ్చే నిధులను నిలిచిపోయాయి. దీంతో ఆలయ నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయింది. గమనించిన టీడీపీ నాయకుడు మహేశ్వరరెడ్డి ఆలయా న్ని పరిశీలించి తిరిగి ఆలయం పనులను పూర్తిచేసేందుకు శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడు తూ పవిత్రమైన ఆలయాలకు కూడా రాజకీయ గ్రహణం పట్టడం దారుణమన్నారు. ఈ ఆలయం పనులు పూర్తయితే సురభి ప్రజలు సంతోషిస్తారన్నారు. అందుకు త్వరగా పనులు పూర్తిచేసేందుకు సిద్ధమయ్యారు.

దళిత ఫోరం జిల్లా చైర్మన్‌గా కిశోర్



బూచిపాటి కిశోర్

కడప (ఎడ్యుకేషన్) జూన్ 23 : దళిత ఫోరం జిల్లా చైర్మన్‌గా బూచిపాటి కిశోర్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం దళిత ఫోరం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ జిల్లాలో దళిత సామాజిక వర్గానికి చెందిన సమస్యలు తమ దృష్టికి వస్తే చట్టపరంగా న్యాయం చేసేందుకు దళితుల పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగేలా పనిచేస్తుందన్నారు. అవసరమైతే ఏ స్థాయి ఉద్యమానికి అయినా పనిచేస్తామని చెప్పారు. వారం రోజుల్లో దళిత ఫోరం పూర్తిస్థాయి కార్యవర్గాన్ని నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ కూడా ఏర్పాటు చేసి చట్టపరమైన సమస్యలు కూడా దళితవర్గానికి చెందిన న్యాయవాదులు కూడా కలుపుకుని రాజకీయాలకతీంగా పనిచేస్తామన్నారు.

జీఓ 117 రద్దు చేయాలి.. 12వ పీఆర్సీ, ఐఆర్ ప్రకటించాలి

- ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

కడప (ఎడ్యుకేషన్), జూన్ 23 : నూతన ప్రభుత్వం జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఆదివారం కడప నగరం అలంఖాన్‌పల్లెలో జిల్లా శాఖ అభ్యాసవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ప్రకటించినందుకు హర్షం వ్యక్తంచేస్తూ పాఠశాలకు గొడ్డలిపెట్టులా పరిణమించిన 117 జీవోను వెంటనే రద్దుచేయాలని 3, 4, 5 తరగతుల విలీనాన్ని వెనక్కి తీసుకునేందుకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ చర్యలు చేపటాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యానారాయణ మాట్లాడుతూ డీఈఓ పూల్‌లో ఉన్న పండిట్, పీఈటీలకు ప్రమోషన్లు చేపట్టాలని గతప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలను కూడా విడుదల చేయాలని కోరారు. అలాగే ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్, సీహెచ్ఎస్ పెండింగు బిల్లుల సమస్యలు పేరుకున్నాని, వాటిని త్వరగా పరిష్కరించాలని 12వ పీఆర్సీకి సంబంధించి ఐఆర్ ప్రకటిఇచాలన్నారు. ఉపాధ్యాయుల పక్షపాత ప్రభుత్వంగా ఉద్యోగుల మన్ననలు పొందాలని కోరారు.జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, కొండారెడ్డి మాట్లాడుతూ కేజీబీవలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని 1998 2008 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఎంటీఎస్ ఉపాధ్యాయులుగా ఉద్యోగంలో చేరిన వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర నాయకులు వెంకట్రామిరెడ్డి, ఎరుకలరెడ్డి పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించండి

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 23 : రాష్ట్రంలోని అత్యంత ప్రాధాన్యత కలిగిన రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న చిరు ఉద్యోగులైన వీఆర్‌ఏల సమస్యలపై ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. 24న జరిగే మొదటి మంత్రివర్గ సమావేశంలో వీఆర్‌ఏల సమస్యలను చర్చించి పేస్కేలు అమలుకు కృషి చేయాలని ఈశ్వరయ్య అన్నారు. వీఆర్‌ఏల ఆశాలకనుగుణంగా 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే నామిని వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్‌తో కలిసిన గుజ్జుల ఈశ్వరయ్య, వీఆర్‌ఏల బృందం మంత్రి దృష్టికి పలు విషయాలు తీసుకెళ్లారు.

నిమ్మకాయల మార్కెట్‌ను ప్రారంభించిన మహేశ్వరరెడ్డి



నిమ్మకాయల మండీని ప్రారంభిస్తున్న మహేశ్వరరెడ్డి

చక్రాయపేట, జూన్ 23:నాగులగుట్టపల్లెలో ఆదివారం నిమ్మకాయల మార్కెట్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి ప్రారంభించారు. నిమ్మకాయల మండీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ ప్రాంతాలైన బెంగుళూరు, మదనపల్లె, రాయచోటి, కదిరి తదితర ప్రాంతాలకు రైతులు నిమ్మకాయలు వేసుకొని వెళ్లేవారని, రైతులకు అలాంటి పరిస్థితి రాకుండా నాగులగుట్టపల్లెలో నిమ్మకాయల మండీని ప్రారంభించడం శుభదాయకమన్నారు. మాజీ సర్పంచు సుబ్బరామయ్య, యువనాయకుడు రాహుల్, దశరథ, కువైట్ సిద్దయ్య, బుజ్జిబాబుపాల్గొన్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు

• ఛిద్రమైన రోడ్లు • ప్రయాణం నరకప్రాయం • ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు





దొబ్బుడుపల్లె గ్రామ శివార్లలో దెబ్బతిన్న తారురోడ్డు, తాడిపత్రి రోడ్డులో దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ ఎదురుగా రోడ్డు గుంతలు

జమ్మలమడుగు, జూన్ 23: జమ్మలమడుగు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వివిధ సమస్యలు అధికార పార్టీకి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గత అయిదు సంవత్సరాల నుంచి జమ్మలమడుగు ప్రాంతంలో పలుచోట్ల రోడ్లు ఛిద్రమైపోయాయి. గత ప్రభుత్వం రోడ్లనుకానీ, వివిధ సమస్యలపై పట్టించుకోలేదని ఆరోపణలున్నాయి. అందులో భాగంగా జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం మండల కేంద్రం నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే రోడ్లు ఛిద్రమై గుంతలు దర్శనమిస్తున్నాయి. తాడిపత్రి రోడ్డులోని దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ ఎదురుగా సర్కిల్ లో రోడ్డు నెర్రెలు చీలి అయిదు సంవత్సరాల నుంచి గుంతలు దర్శనమిస్తున్నాయి. అలాగే తలమంచిపట్నం గ్రామం మలుపు వద్ద రోడ్డు నెర్రెలు చీలింది. తలమంచిపట్నం తాండా నుంచి దొడియం గ్రామానికి వెళ్లేదారి అధ్వానంగా మారింది. నక్కవానిపల్లె గ్రామం వద్ద గుంతలు ప్రయాణం చేయలేక అక్కడి స్థానికులు గుంతలకు మట్టి తరలించి పూడ్చారు. నక్కవానిపల్లె నుంచి దొబ్బుడుపల్లె గ్రామం వరకు, అక్కడి నుండి తాడిపత్రి పెన్నా సిమెంటు వెళ్లే దారి తారురోడ్డు గుంతలు పడి రోడ్డు ఛిద్రమై వర్షపునీరు వెళ్లి పూర్తిగా కోతకు గురైంది. ఆదారిలో జమ్మలమడుగు ప్రాంతం నుంచి ఆర్టీసీ బస్సు ఉదయం 8 గంటల నుంచి బయల్దేరుతుంది. అయితే రంగనాయకుల కోన తదితర గ్రామాలకు వెళ్లేవారు తాడిపత్రి దగ్గరగా ఉంటుందని, మైలేజీ ఎక్కువగా ఉంటుందని, ఆదారిలో ఆటోలు, కార్లు వెళుతుంటాయి. సమీప గ్రామాల చుట్టూ రోడ్డు దెబ్బతిన్నాయి. ఆ ప్రాంతంలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే జమ్మలమడుగు, మైలవరం వెళ్లే రోడ్డు ఇరిగేషన్ శాఖకు సంబంధించిన బైపాస్‌రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొత్త ప్రభుత్వంలో రోడ్లు ఎలాంటి సమస్యలు లేకుండా త్వరగా మరమ్మతులు చేస్తారని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

పూడిక తీత పనులు



ప్రొద్దుటూరు , జూన్ 23 : రాష్ట్రంలో డయేరియా విజృంభించకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో భాగంగా మున్సిపల్ అధికారులు ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు.ఆదివారం మడూరు చానల్‌ల్లో ఎక్స్‌కవేటర్లతో శానిటరీ అధికారులు పూడిక తీత పనులు ప్రారంభించారు. యుద్ధప్రాదిపదికన కాలువల్లో పూడిక తీసి దోమలు ప్రభలకుండా చర్యలు చేపట్టారు. డయేరియా రాకుండా ప్రతిఇంటికి వెళ్లి అవగాహన పెంపొందించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, నూర్‌బాషా పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

బద్వేలుటౌన్, జూన్ 23 : ఆర్యవైశ్యులకు అండగా ఉంటామని టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు కిందపడి చికిత్స పొందుతున్న వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్, టీడీపీ వాణిజ్యవిభాగం జనరల్ సెక్రటరీ కనుమర్లపూటి ప్రసాద్‌ను ఆదివారం ఆయన నివాసంలో టీడీపీయువనేత రితేష్‌కుమార్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, వెంగల్‌రెడ్డి కలిశారు. ఈ కార్యక్రమంలో పీవీఎన్ ప్రసాద్, శివయ్యస్వామి,నాగభూషణం, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

గోపవరం, జూన్ 23 : తహసీల్దారు కార్యాలయంలో ఉదయం 9 నుంచి ప్రజాఫిర్యాదుల సేకరణ వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని మండల ప్రత్యేక అధికారిఎం.నాగరాజు పేర్కొన్నారు. అలాగే గ్రామ సచివాలయాల్లో కూడా అర్జీలు స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

దుప్పట్లు పంపిణీ



ప్రొద్దుటూరు టౌన్, జూన్ 23: దివ్యాంగులను ఆదుకోవాలని ఆల్‌అఫ్ దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చలపతిరావు పేర్కొన్నారు. ఆదివారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో బీజేపీ మాజీ రాష్ట్ర ఎస్సీమోర్చ అధ్యక్షుడు డాక్టర్ సునీల్‌కుమార్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు రామమోహన్‌రెడ్డి, ఎస్సీమోర్చ నాయకుడు రమణయ్య, బాబమ్మ, శైలజ, కొండమ్మ, రషీద్, నరేష్, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



షేక్ అబీదా

జమ్మలమడుగు, జూన్ 23: జమ్మలమడుగు మండలంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన షేక్ అబీదా (23) రెండు రోజుల నుంచి అదృశ్యమైంది. ఈనెల 22వ తేదీ ఉదయాన్నే ఇంటిలో చెప్పకుండా ఇద్దరు పిల్లలను ఇంటి వద్దనే వదిలి వెళ్లినట్లు ఆమె భర్త ఖలీల్ ఆదివారం సాయంత్రం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమె ఆచూకీ తెలిస్తే జమ్మలమడుగు పోలీసులకు ఫోన్ చేసి తెలుపగలరని ఏఎస్ఐ మురళీయాదవ్ తెలిపారు. 9121100603కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

ఏరువాక పౌర్ణమి వేడుకలు



దీపాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు

జమ్మలమడుగు, జూన్ 23: జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో శనివారం రాత్రి చౌడేశ్వరీదేవి, గంగమ్మ దేవాలయంలో స్థానిక మహిళాభక్తులు దీపాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతులందరికీ పంటలు బాగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ మహిళా భక్తులు అమ్మవారి ఆలయం ఎదుట కోలాటం నిర్వహించారు. అనంతరం అమ్మవారి వేషధారణలో అలంకరించి దీపాల మధ్య పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కుకున్నారు. అనంతరం ప్రసాద వినిమయం చేశారు.

వెబ్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ

మైదుకూరు, జూన్ 23 : నిరుద్యోగ యువతకు వెబ్ డెవలప్, సాఫ్ట్‌వేర్ డిజైనింగ్‌పై ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ పి.నారాయణరెడ్డి, స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ మాలేపాటి రాధారాం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సులు 3 నెలల పాటు శిక్షణతో పాటు ఉపాధి ఇవ్వడం జరుగుతుందన్నారు.బీకాం,బీఎస్సీ,బీటెక్ చదివిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు. ఇతర వివరాలకు 9398348760, 9701801902లకు ఫోన్ చేయాలని కోరారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

జమ్మలమడుగు, జూన్ 23: జమ్మలమడుగులోని భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో దివంగత నేత బీజేపీ పితామహుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్థంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కొండయ్య, పట్టణాధ్యక్షుడు ఓబుళరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటేష్, కౌన్సిలర్ బాణాశివరామలింగారెడ్డి, మహిళా అధ్యక్షురాలు మల్లీశ్వరి, మల్లిక, బీర్రు సంతోష్, కొమెర్ల రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీకి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఆదివారం ముఖర్జీ వర్థంతి సందర్భంగా పోరుమామిళ్లలో బీజేపీ మండల పార్టీ నాయకులు నాగేంద్ర, ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ రమణచారి, బద్వేలు కోకన్వీనరు పల్లెంశెట్టి పండరి, మండల జనరల్ సెక్రటరీ జయరాం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

టీడీపీకి బీసీలు రుణపడి ఉంటారు



బద్వేలు, జూన్ 23: బీసీలు అన్నివేళలా టీడీపీకి రుణపడి ఉంటారని పూలే ఆశయ సాధన సమితి ఛైర్మన్ గురుమూర్తి, వైస్ ఛైర్మన్ వెంకటరమణ యాదవ్ పేర్కొన్నారు. బీసీలు రాజకీయంగా ఎదగాలనే ఉద్దేశంతో రాష్ట్ర టీడీపీ అధ్యక్ష పదవిని పల్లా శ్రీనివాస్ యాదవ్‌కు ఇచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం వారు ముందుగా వారు పూలే, సావిత్రిబాయిపూలే అనంతరం చంద్రబాబు, పల్లా శ్రీనివాసయాదవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశా రు. కార్యక్రమంలో జె.సింగరయ్య యాదవ్, రాష్ట్ర యాదవ సంఘం సెక్రట రీ సింగరయ్య, ఎస్.ఎస్.సుబ్బరాయుడు, రామసుబ్బయ్య యాదవ్, ప్రైవేటు లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకయ్య యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మకు బోనాలు



అట్లూరు, జూన్ 23 : మండలంలోని కొండూరులో వెలసిన మారెమ్మకు ఆదివారం కొండూరు గ్రామస్థులు తెల్లవారుజామున నుంచే పూజలు నిర్వహించి బోనాలు, పొంగులు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏడాది జ్యేష్ఠమాసంలో బోనాలు పెట్టుకోవడం ఆచారమని గ్రామపెద్దలు తెలిపారు. మారమ్మను గ్రామ దేవతగా కొలుస్తామని కొలిచిన వారికి కొంగుబంగారంగా కోరికలు తీరుస్తున్నదన్నారు. చుట్టూ గ్రామాల ప్రజలు నమ్మకమని గ్రామపెద్దలు తెలిపారు.

పెన్షన్ పెంపుపై అభినందన సభ



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

బద్వేలుటౌన్, జూన్ 23 : ముఖ్యమంత్రి చంద్రబాబు వికలాంగుల ందరికీ 3వేలు ఉన్న పెన్షన్‌ను రూ.6వేల రూపాయలకు పెంచడంతో దివ్యాంగుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వికలాంగుల పెన్షన్ పెంపుపై అభినందన సభనిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. చంద్రబాబు వికలాంగుల సంక్షేమానికి అహర్నిశలు కష్టపడుతున్నారని ఆయన అన్నారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి దివ్యాంగులతో కలసి పాలాభిషేకం చేశారు.కూటమి అభ్యర్థులు వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, బసవి రమేష్, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి, బొమ్మన విజయ్, మురళీక్రిష్ణ, వెంకటేశ్వర్లు,వెంకటసుబ్బయ్య,పీవీఎన్‌ప్రసాద్, నరసింహ నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి



విద్యార్థినికి నగదు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 23: విద్యార్థులు విద్య ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బుశెట్టి కల్యాణ మండపంలో ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో టీవీఎస్ గ్రూపు కంపెనీల సహకారంతో మండలంలోని 10వ తరగతి చదివి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. 25 మంది విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.2 వేలు వంతున 26 మంది విద్యార్థులకు, రూ.1500 వంతున 51 మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యను ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ లోపారి సుధాకర్, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, వంకదార వీరభద్రయ్య, సినీనటి ఆశ్రిత, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, న్యాయవాది సి.వి.సురేష్, స్టాన్లీ వినయ్, టీవీఎస్ గ్రూపు సంస్థల నిర్వాహకుడు సి.వి.సుబ్బారావు, ఆదరణ సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్యశిబిరానికి విశేష స్పందన



జమ్మలమడుగు, జూన్ 23: జమ్మలమడుగు పట్టణంలోని సాయిపరమేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణలో జమ్మలమడుగు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నంద్యాల శాంతిరామ్ కంటి ఆస్పత్రి వైద్యబృందం వారి సౌజన్యంతో ఉచిత కంటివైద్యశిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరాన్ని రోటరీక్లబ్ బృందం వారు ప్రారంభించారు. అధ్యక్షుడు కె.వి.మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా జమ్మలమడుగు పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి కంటి ఆపరేషన్లను ఉచితంగా చేయించడం కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి, ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ నాగార్జున, డాక్టర్ శేఖర్, రోటరీ క్లబ్ సభ్యులు బండారు శ్రీనివాసులు, ఐరన్ రఫి, కుండా భాస్కర్, అధ్యాపకులు నాగేశ్వరరెడ్డి, సంజీవరాయుడు, పంచాయతీ రాజ్ డీఈ విజయభాస్కర్‌రెడ్డి, శివగణపతి, కె.నారాయణ, తదితర బృందం, రోగులు పాల్గొన్నారు.

స్లాబ్ పెచ్చులూడిపడి కానిస్టేబుల్‌కు గాయాలు

మైదుకూరు, జూన్ 23 : స్టేషన్‌లో కానిస్టేబుల్‌పై స్లాబ్ పెచ్చులూడిపడి గాయపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకివచ్చింది. స్థానిక స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కోర్టు కానిస్టేబుల్ సుబ్బరాయుడు రెండు రోజుల క్రితం స్టేషన్‌లో విశ్రాంతి తీసుకుంటుండగా స్లాబ్ పెచ్చులూడి ముఖంపై, ముక్కుపై పడి గాయాలు అయ్యాయి. కాగా ఆయన ప్రొద్దుటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నేతలు



టెంకాయలు కొడుతున్న టీడీపీ నేతలు

బ్రహ్మంగారిమఠం, జూన్ 23 : ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో కడప నియోజకవర్గం శాసనసభ్యురాలిగా రెడ్డప్పగారి మాధవీ రెడ్డి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలపొందారు. దీంతో ఆదివారం పాలెంపల్లె గ్రామానికి చెందిన కడప 50వ డివిజన్ టీడీపీ నేత సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 108 టెంకాయలను వీరబ్రహ్మేంద్ర స్వామికి టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నట్లు తీర్చుకున్నారు. టీడీపీ నేతలు ఎ.వెంకటసుబ్బయ్య,పట్నం సుబ్బరాయుడు, చిన్న, చంద్ర, వెంగల్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పదవీ విరమణపొందిన ఉపాధ్యాయునికి సన్మానం



పోరుమామిళ్ల, జూన్ 23 : మండలంలోని పుల్లీడు గ్రామంలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తించిన వాడకట్టు దేవగిరయ్యకు వాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణమండపంలో సన్మానం నిర్వహించారు. ఈయన మే 31న పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆదివారం పోరుమామిళ్లలోని వాసవీ కన్యకా పరమేశ్వరి మండపంలో ఉపాధ్యాయబృందం ఎంఈవో కాశయ్య, రిటైర్డ్ ఎంఈవో రత్నస్వామి, గోపవరం ఎంఈవో రఘురామిరెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొని ఆయనను సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఆయన చేసిన సేవలను కొనియాడారు.

తెలుగు సాహిత్య శిఖరం దివాకర్ల వెంకటావధాని



వెంకటావధాని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బద్వేలు, జూన్ 23: తెలుగు సాహిత్య శిఖరం ఆచార్య దివాకర్ల వెంకటావధాని అని సాహితీవేత్త డాక్టర్ గానుగపెంట హనుమంతరావు నివాళులర్పించారు. ఆదివారం విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో దివాకర్ల వెంకటావధాని 125వ జయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటావధాని పరిశోధకుడిగా, విమర్శకుడిగా పేరుగాంచారన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘ ప్రతినిధులు బ్రహ్మయ్య, మహబూబ్ సాహెబ్, పిచ్చయ్య, ఆనందరావు, చెన్నరాయుడు, లక్ష్మీనరసయ్య, శర్మ, దర్శి సుబ్బరాయుడు, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

మధ్యంతరభృతి వెంటనే ప్రకటించాలి

కడప (ఎడ్యుకేషన్), జూన్ 23 :రాష్ట్రప్రభుత్వ ఉద్యోగ ఉపాధి పెన్షనర్లకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వపీఆర్సీ అమలులో జాప్యం జరిగేఅవకాశం ఉన్నందున వెంటనేఐఆర్ ప్రకటించాలన్నారు. 11వ పీఆర్సీలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయారన్నారు. 12వ పీఆర్సీని మెరుగైన ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలని 11వ పీఆర్సీ బకాయిలను కరువు భత్యం బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు క్రిష్ణారెడ్డి, గురయ్య, భాస్కర్‌రెడ్డి, జిల్లా నాయకులు రాంభూపాల్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాల జోజి, అబ్దుల్‌సత్తార్ పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాసంఘాల నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

బద్వేలు, జూన్ 23: బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో మంచినీటి సమస్య పరిష్కంచాలని సీపీఎం పట్టణ కార్యదర్శి శీను డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని మాట్లాడుతూ బద్వేలు పట్టణ వ్యాప్తంగా 35 వార్డులలో తీవ్రమైన నీటి కొరత ఏర్పడిందని,దీనిని పరిష్కరించడంలో మున్సిపాలిటీ పాలకవర్గం తీవ్రంగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మునిసిపాలిటీలోని అన్ని వార్డులలో మంచినీటిని సరఫరా చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు మోక్షమ్మ, బ్రహ్మయ్య, అనంతమ్మ, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నాగార్జున, అంజనేయులు, ఇమ్మానుయేల్, రమణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.